రాష్ట్రపతి నిలయంలో ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం

బొల్లారం: ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాష్ట్రపతి నిలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ నైపుణ్యాలతో యువత సాధికారత' అనే నినాదంతో యువతకు శిక్షణ అనే అంశం పై వక్తలు ప్రసంగించారు. కేంద్ర మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 1500 మందికి పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిశ్రమ నిపుణులు, రాష్ట్రంలోని దాదాపు 60 ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల నుండి హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ డిజిటల్ శిక్షణ ద్వారా యువత అవకాశాలను ఎలా వినియోగించుకోవాలో వివరించారు. యువత ఎదగడానికి టెక్నాలజీ కీలకం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ జనరల్ భగత్ సింగ్, ఆర్‌డీఎస్‌డీఈ ప్రాంతీయ డైరెక్టర్ కే. శ్రీనివాసరావు యువతకు ఆవశ్యకమైన నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలపై సూచనలు చేశారు.

ప్రశాంతంగా ముగిసిన ఉజ్జయినీ మహంకాళి బోనాలు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర ప్రశాంతంగా ముగిసింది. ఆది, సోమవారాల్లో జరిగిన బోనాలు, రంగం కార్యక్రమంలో లక్షల మంది భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. బోనాల జాతర నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు, పోలీసులు అవిశ్రాంతంగా పనిచేశారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. చిన్న చిన్న సంఘటనలు మినహా జాతర ప్రశాంతంగా ముగియడంతో అన్ని శాఖల అధికారులు, పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. రెండు రోజులు పాటు దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. సికింద్రాబాద్‌లోని వివిధ ప్రాంతాల నుంచి ఫలహార బండ్ల ఊరేగింపు కొనసాగింది. యువత ఫలహార బండ్లతో పాటు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించడం ఆనవాయితీ. ఊరేగింపులో ఎక్కడా ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

దివ్యాంగులకు పరికరాల పంపిణీకి చర్యలు

అమీర్‌పేట: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహకారంతో ఏడీఐపీ పథకం కింద దివ్యాంగులకు అవసరమైన పరికరాలను అందిస్తున్నట్లు అమీర్‌పేట కార్పొరేటర్ సరళ,బీజేపీ నాయకులు బి.శ్యాంసుందర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం అమీర్‌పేట గురుగోవింద్‌సింగ్ స్టేడియంలో దివ్యాంగులకు అసరమైన కృత్రిమ పరికరాల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. దాదాపు 300 మందికి సహాయ పరికరాల కోసం కొలతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా అర్హులైన దివ్యాంగులకు నాణ్యతతో కూడిన సహాయ పరికరాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ దివ్యాంగుల కమిటి చైర్మన్, నాగేశ్వర్‌రావు, దిశ కమిటీ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, పార్టీ నేతలు శ్రీశైలం గౌడ్, దయానంద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు మాస్ ఫాగింగ్

అడ్డగుట్ట: దోమల నివారణకు ప్రత్యేక చర్యలను తీసుకుంటున్నామని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్ తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల నివారణ చర్యల్లో భాగంగా మంగళవారం అడ్డగుట్ట డి సెక్షన్ లో ఎంటమాలజీ సిబ్బందితో మాస్ ఫాగింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దోమల నియంత్రణకు ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాజు సుందర్, లింగాని శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, అమర్ బన్సోడే, రామప్ప చారి, శ్రీరామ్ నాయక్, శంకర్, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓయూలో బీసీ బోనం

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీలకు కల్పించిన 42 శాతం రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్ చేర్చాలని డిమాండ్ చేస్తూ ఓయూలో బీసీ హక్కుల బోనం కార్యక్రమం చేపట్టారు. మంగళవారం ఆల్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ జేఏసీ నాయకుడు నూకల మధుయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన బీసీ బోనం కార్యక్రమానికి బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపకులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన 42 శాతం బీసీ బిల్లును వెంటనే 9వ షెడ్యూల్‌ల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో మహిళ రిజర్వేషన్ల కోటాను ప్రవేశపెట్టాలన్నారు. కార్యక్రమంలో ఓయూ బీసీ అధ్యాపకులతో పాటు వరంగల్ శ్రీనివాస్, బారి అశోక్‌కుమార్, అవ్వార్ వేణు, సైదులుయాదవ్, తేజ, శంకర్, వికాస్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై నీలి నీడలు

నిధుల రద్దుతో...

- పనులకు బ్రేక్
- నిలిచిపోయిన రోడ్డు పనులు
- నత్తనడకన నాలా విస్తరణ
- అర్ధాంతరంగా కమ్యునిటీహాళ్లు
- లష్కర్‌లో జీహెచ్‌ఎంసీ పనుల తీరు ఇదీ..

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులకు బ్రేకులు పడుతున్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడం, జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా పలు అభివృద్ధి పనులు ముందుకు సాడగం లేదు. ఒక్కో అభివృద్ధి పని పూర్తి చేయించుకోవడం కోసం కార్పొరేటర్లు, ప్రజలు పలుమార్లు అధికారులకు విన్నవించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మురికివాడలకు నిలయమైన అడ్డగుట్ట, బౌద్ధనగర్, మెట్టుగూడ డివిజన్ల పరిధిలో అధికారులకు తోచిన తీరులో మాత్రమే అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ఆయా డివిజన్ల సమస్యల పరిష్కారం కోసం రూపొందించిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు రద్దు కావడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి.

ఆగిన కమ్యునిటీహాళ్ల నిర్మాణం

నియోజకవర్గం పరిధిలోని ఐదు డివిజన్లలో 19 కమ్యునిటీహాళ్ల నిర్మాణం కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు నాలుగేళ్ల క్రితం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో దాదాపు అన్నింటికి అప్పటోనే నిధులు మంజూరయ్యాయి. టెండర్లు కూడా పూర్తి చేసిన అధికారులు పనుల ప్రారంభోత్సవాలకోసం నెలల తరబడి జాప్యం చేశారు. ఇందులో తొమ్మిది కమ్యునిటీ హాళ్ల పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నిధులు మంజూరై పనులు ప్రారంభం కాని కమ్యునిటీహాళ్లు ఇంకా 10 ఉండడం గమనార్హం. డివిజన్‌కు ఒకటి రెండు చొప్పున కమ్యునిటీహాళ్లు మొండిగోడలతో రెండు మూడేళ్లగా దర్శనం ఇస్తున్నాయి.

రిటైనింగ్ వాల్స్‌ది అదే పరిస్థితి....

నాలా విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టిన రిటైనింగ్‌వాల్స్ నిర్మాణాల పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే సాగుతోంది. గత ఏడాది కురిసిన వర్షాలకు నియోజకవర్గంలోని లాలాపేట నుంచి అడ్డగుట్ట, మెట్టుగూడ నుంచి వారాసీగూడ వరకు ఆవరించి ఉన్న నాలా గోడలు ధ్వంసమయ్యాయి. సీతాఫల్‌మండి ప్రాంతంలో నాలా రిటైనింగ్ వాల్ కూలిపోయి పలు బస్తీలు, కాలనీలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. మిగతా ప్రాంతాల్లో స్వల్పంగా నాలా గోడలు కూలిపోయాయి. నాలా ఆధునీకరణ పనులకు మంజూరైన నిధులు కూడా విడుదల కాకపోవడంతో నాలా వాల్ ఎత్తును పెంచడం, రిటైనింగ్‌వాల్స్, అవుట్‌లెట్లు నిర్మించడం వంటి అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు.


అర్ధాంతరంగా నిలిచిపోయిన అడ్డగుట్ట కమ్యునిటీహాల్

రహదారులకు బ్రేకులు

ప్రధాన, అంతర్గత కలుపుకుని మొత్తంగా 68 వరకు రహదారుల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయి. రహదారుల నిర్మాణం కోసం ఇంజినీరింగ్ విభాగం అధికారులు గత ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించడం, ఉన్నతాధికారులు నిధులు మంజూరు చేయడం వరకు ప్రక్రియ సాఫీగా సాగింది. అప్పట్లో ఎన్నికల కోడ్‌లు ప్రారంభోత్సవాలకు ఆటంకంగా మారాయి. ఎన్నికల తర్వాత రహదారుల నిర్మాణం కోసం గతంలో రూపొందించిన ప్రతిపాదనలు, మంజూరైన నిధులను కొత్త ప్రభుత్వంలోని అధికారులు ఏకంగా రద్దు చేశారు. పలు సాంకేతిక కారణాలను ఎరగా చూపుతున్న అధికారులు రహదారుల నిర్మాణాలు పూర్తి చేయక పోతుండడంతో ఆయా డివిజన్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా బోనాల జాతర

చిలకలగూడ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మ బోనాల జాతర నిర్వహించనున్నట్లు సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో తాగునీరు, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం తదితర అంశాలపై చర్చించారు. అన్ని శాఖల సమన్వయంతో ఈనెల 20,21 తేదీల్లో చిలకలగూడ బోనాలు, రంగం కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ మహేందర్ గౌడ్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అండాళ్లు, ఆలయ కమిటీ చైర్మన్ గుంటి కృష్ణ, ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు, అడ్మిన్ ఎస్‌ఐ ఆంజనేయులు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు కౌశిక్, శ్రీకాంత్, కుషాల్, వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు దేవేందర్‌యాదవ్, శ్రీనివాస్, అమర్నాథ్, జగన్, ధర్మవీర్, అర్చకులు తిరుమాల చార్యులు, నాయకులు సాయి యాదవ్, జలంధర్‌రెడ్డి, మురళీ, లక్ష్మీ, పద్మ, అర్చన, చిట్టి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు ఆహ్వానం

బొల్లారం: తిరుమలగిరిలోని పెద్ద కమెలా నల్ల పోచమ్మ ఆలయంలో జూలై 17న నిర్వహించనున్న బోనాల జాతర, పలారం బండి ఊరేగింపులో పాల్గొనాల్సిందిగా టీం ఆర్కే అండ్ ఫ్రెండ్స్ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను ఆహ్వానించారు. అనంతరం ఆలయ అభివృద్ధి, ఊరేగింపు ఏర్పాట్లపై టీం సభ్యులు ఎమ్మెల్యేతో చర్చించారు. కార్యక్రమంలో కోమల్, వాసు, అఖి, విషాల్ తదితరులు పాల్గొన్నారు.



క్రైం కార్నర్..

వ్యక్తి అనుమానాస్పద మృతి

సనత్‌నగర్: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి రోడ్డుపై శవమై కనిపించిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్‌కు చెందిన సాయిరామ్ (45) హోటల్‌లో పని చేసేవాడు. ఈ నెల 13న సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత అతను ఎర్రగడ్డ యాక్సిస్ బ్యాంక్ సమీపంలో రోడ్డుపై పడి ఉన్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. 108 అంబులెన్స్ సిబ్బంది అతడిని పరీక్షించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. సాయిరాం మృతికి కారణాలు తెలియరాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు..

సనత్‌నగర్: భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్న భర్తపై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మోతీనగర్ జనప్రియా మెట్రోపోలీస్‌లో హారిక సుష్మాంజలి, కృష్ణప్రసాద్ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం. గత కొన్నేళ్లుగా కృష్ణప్రసాద్ తన భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. తల్లిదండ్రులను చూడడానికి కూడా అనుమతించడం లేదంటూ హారిక సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ..

సనత్‌నగర్: పార్కు చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.మోతీనగర్‌కు చెందిన అరవింద్ లధాబాయి (22) అక్షర ఆఫీస్ సప్‌లైలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తుంటాడు. ఈ నెల 12న మధ్యాహ్నం అతను తన టీవీఎస్ ఎక్స్‌ఎల్‌ను ఇంటి ఎదుట పార్కు చేశాడు. గంట తర్వాత వచ్చి చూడగా వాహనం కనిపించకపోవడంతో సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే సామాజిక బహిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: బీఈ రిజర్వేషన్లను ఎవరైనా అడ్డుకుంటే వారిని సామాజిక బహిష్కరణ చేస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్లను అడ్డుకోవాలని చూసే వర్గాలకు బీసీ కులాల నుంచి ఎలాంటి సహకారం అందకుండా ఊరూరా చాటింపు వేయించనున్నట్లు తెలిపారు. సామాజిక బహిష్కరణలో భాగంగా నాయీ బ్రాహ్మణ సోదరులు కంటింగ్ చేయారని, రజక సోదరులు దుస్తులు ఉతకరని, ఇతర బీసీల కులాల వృత్తిదారులు సైతం ఎలాంటి పనులు చేయబోరని తెలిపారు. తమ నోటికాడ ముద్దను ఏ వర్గమైనా, పార్టీ అయినా అడ్డుకోవాలని చూస్తే వారికి పుట్టగతులు లేకుండా చేస్తామని హెచ్చరించారు.

పీహెచ్‌డీ ప్రవేశాల్లో బీసీ విద్యార్థులకు అన్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ప్రవేశాల్లో పీహెచ్‌డీ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ అన్నారు. సీట్ల కేటాయింపులో బీసీలకు జరుగుతున్న అన్యాయంపై మంగళవారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతి పత్రం అందజేశారు. పీహెచ్‌డీలో అతి తక్కువ సీట్లు, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలు కారణంగా బీసీ విద్యార్థులకు నష్టం జరుగుతుందని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. పది సీట్ల కంటే ఎక్కువ ఉంటేనే ఈడబ్ల్యూఎస్ కోటాను అమలు చేయాలని, ఈ విషయాన్ని ఓయూ అధికారులకు వివరించాలని కోరామన్నారు. కార్యక్రమంలో కౌశిక్, రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు



లాలాపేట: తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఫెడరేషన్ స్టాఫ్ ఆండ్ వర్కర్స్ యూనియన్ బి22 ఐఎన్‌టీయూసీ విజయ డెయిరీ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం మంగళవారం లాలాపేటలోని విజయ డెయిరీ సమీపంలోని యూనియన్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. టీజీడీడీసీఎఫ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా సాల యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి. అశోక్‌కుమార్, జనరల్ సెక్రటరీగా జి. బాల ప్రసాద్, జాయింట్ జనరల్ సెక్రటరీ కె. శ్రీధర్, అడిషినల్ జనరల్ సెక్రటరీలుగా విజయలక్ష్మీ, ఉమ మాటూరీ, కోశాధికారులుగా పి. నిఖిల్ కుమార్, ఎస్ మౌనిక, ఉమెన్స్ వెల్ఫేర్ ప్రతినిధులు(షీ టీమ్స్) ఇన్‌చార్జిలుగా విజయలక్ష్మీ, హారతి, ఉదయశ్రీ తదితరులను ఎన్నుకున్నారు.కమిటీకి సలహాదారులుగా ఎండీ మసూలుద్దీన్ వ్యవహరిస్తారు. ఈ కమిటీ 2 సంవత్సరాల కాలపరిమితితో పని చేస్తుంది. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ విజయ డెయిరీ యాజమాన్యానికి, ఉద్యోగుల మధ్య వారధిగా ఉంటూ సంస్థ అభివృద్ధితో పాటు ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నూతన కమిటీని ఎన్నుకున్న ఉద్యోగులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

టీజీపీసీబీలో ఘనంగా బోనాల జాతర..

సనత్‌నగర్: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) కార్యాలయంలో ఆషాఢ మాస బోనాల జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని రంగు రంగుల పూలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు బోనాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. టీజీపీసీబీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుగౌడ్, జనరల్ సెక్రటరీ నవీన్‌గౌడ్, వివేకానందమూర్తి, రాజారమేష్, వెంకట్‌రావు, స్వామి, బాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా శాకంబరి ఉత్సవాలు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో మంగళవారం శాకంబరి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఏటా ఆషాఢ మాసంలో 3వ మంగళవారం పండ్లు, కూరగాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. దాదాపు 50 క్వింటాళ్ల కూరగాయలతో ఆలయ ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అలంకరించినట్లు ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్, ప్రధాన అర్చకులు అనిల్ పంతుల్ తెలిపారు. ఈ సందర్భంగా తెల్లవారు జామున ఆలయంలో అభిషేకనిర్వహించారు. ప్రకృతి పరంగా లభించే కూరగాయలను ఆషాఢ మాసంలో అమ్మవారికి సమర్పించడం ఆనావాయితీగా వస్తోందని, ఈ కూరగాయలను భక్తులకు ప్రసాదంగా పంచుతామన్నారు.


శాకంబరి అలంకారంలో బల్కంపేట ఎల్లమ్మ

ప్రశాంతంగా బోనాల జాతర జరుపుకోవాలి

చిలకలగూడ: బోనాల జాతరను మతసామరస్యంతో శాంతియుతంగా నిర్వహించుకోవాలని చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిలకలగూడ ఠాణాలో ఎస్‌హెచ్‌ఓ అనుదీప్ నేతృత్వంలో ఆలయ, ఫలహారం బండ్ల నిర్వాహకులు, కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజేలు, పాడ్‌బ్యాండ్‌లకు అనుమతి లేదని, ర్యాలీలు, ఊరేగింపులకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈనెల 20,21వ తేదీల్లో జరిగే చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మ బోనాల జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయ నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి, పోలీసులకు సహకరించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే సమాచారం అందించాలని చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ అనుదీప్ కోరారు. మహిళలు, బోనం క్యూలైన్లు, పార్కింగ్, పారిశుద్ధ్యం తదితర అంశాలపై చర్చించారు. ఆలయ నిర్వాహకులు, భక్తుల సలహాలు, సూచనలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు జ్ఞానేశ్వర్, ఆంజనేయులు, ఫలహారంబండ్లు, ఆలయ నిర్వాహకులు గుంటి కృష్ణ, దేవేందర్‌యాదవ్, జలంధర్‌రెడ్డి, ఆకారం రమేష్, టీఆర్‌టీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు..

సనత్‌నగర్: టమాటా.27, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 55, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 60, క్యాప్సికమ్ 75, పచ్చకాకర 38, పందిరి బీర 38, క్యాబేజీ 18, క్యారెట్ 40, దొండ 35, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 75, గోకరకాయ 50, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 27, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 25, చామగడ్డ 25, మొరంగడ్డ 28, కందగడ్డ 35, సొరకాయ 13, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

పేదల సంక్షేమమే ఎస్‌జీఎఫ్ ధ్యేయం


చిన్నారులకు స్పీచ్ థెరఫీ కిట్‌లు అందజేస్తున్న ముకుల్

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లోని నిరుపేదల సంక్షేమమే శ్రీగణేశ్ ఫౌండేషన్ (ఎస్‌జీఎఫ్) లక్ష్యమని ఫౌండేషన్ కన్వీనర్ ముకుల్ అన్నారు. కంటోన్మెంట్ ఐదోవ వార్డు పరిధిలోని పమేన్ క్యాప్‌లో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో స్పీచ్ థెరఫీకి సంబంధించిన పరికరాలు అందజేశారు. అనంతరం పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ముకుల్ మాట్లాడుతూ శ్రీగణేష్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయన్నారు. భవిష్యత్తులో వారికి ఎటువంటి అవసరం వచ్చినా తమ ఫౌండేషన్ తరపున సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

పరిహారం సొమ్ము ఇచ్చాకే భూములిస్తాం

- తేల్చేసిన కంటోన్మెంట్ బోర్డు
- రూ.303 కోట్ల పరిహారం చుట్టూ సాగిన బోర్డు చర్చ

కంటోన్మెంట్: ఎలివేటెడ్ కారిడార్ కోసం అప్పగించిన కంటోన్మెంట్ భూముల పరిహారం సొమ్ము చెల్లించాకే, రాష్ట్ర ప్రభుత్వానికి భూములు అప్పగిస్తామని కంటోన్మెంట్ బోర్డు తీర్మానించింది. పరిహారం సొమ్ముతో చేపట్టాల్సిన పనులు, కంటోన్మెంట్ వ్యాప్తంగా ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు, రామన్నకుంట చెరువు సుందరీకరణ, తదితర అంశాలపై బోర్డులో సుదీర్ఘంగా చర్చించి తీర్మానాలు చేశారు. అధ్యక్షుడు బ్రిగేడియర్ ఎస్. రాజీవ్ అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో సీఈఓ మధుకర్ నాయక్, జాయింట్ సీఈఓ పల్లవి విజయ్ వన్షీ, బోర్డు సభ్యురాలు భానుక నర్మదతో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే శ్రీగణేశ్ బోర్డు సమావేశానికి గైర్హాజరయ్యారు.

చర్చ సాగిందిలా..

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు వచ్చినట్లుగా అధ్యక్షుడు రాజీవ్ ప్రకటించారు. ఇందుకు కృషి చేసిన బోర్డు సిబ్బంది, స్థానిక నేతలు, కాలనీ, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులకు సీఈఓ కృతజ్ఞతలు తెలిపారు.

- రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నందున, ఎలివేటెడ్ కారిడార్‌లకు సంబంధించిన పరిహారం రూ.303 కోట్లు చెల్లించాకే భూములు అప్పగించాలని ఎంపీ ఈటల సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియా (సీఎఫ్ఐ)లోకి వెళ్లాల్సిన నిధులను కంటోన్మెంట్‌కు మళ్లించేందుకు కేంద్రం అంగీకరిస్తూ ఇటీవల ఉత్తర్వులు ఇచ్చిందని సీఈఓ తెలిపారు. అయితే ఈ సొమ్ము ఎస్క్రో అకౌంట్‌లో జమ చేశాకే రాష్ట్ర ప్రభుత్వానికి భూములు ఇస్తామన్నారు. పనుల కొనసాగింపును సైతం డిఫెన్స్ ఎస్టేట్స్ డైరెక్టర్ జనరల్ పర్యవేక్షిస్తారని తెలిపారు.
- ఎలివేటెడ్ పరిహారం సొమ్ముతో పికెట్, ప్యాట్నీ నాలాలతో పాటు హర్షవర్ధన కాలనీ గుండా రామన్న కుంటకు చేరే ఓపెన్ నాలాను ఆధునికీకరించాలని బోర్డు సభ్యురాలు బానుక నర్మద కోరారు. ఓల్డ్ బోయిన్‌పల్లి పరిధిలోని మురుగు నీటిని నేరుగా కంటోన్మెంట్‌లోకి వదలడంపై పదేళ్లగా తాను పోరాటం చేస్తున్నానన్నారు. ప్రస్తుతం బోర్డు సభ్యురాలిగా ఉన్నందున పోరాటం అక్కర్లేదని, బోర్డు సభ్యురాలి వినతిని ఆమోదించాల్సిందిగా ఎంపీ ఈటల సూచించారు.
- రెండు– మూడోవార్డుల పరిధిలోని లక్ష్మీగుంటి కాలనీ బ్రిడ్జిని సైతం పరిహారం సొమ్ముతో చేపట్టే పనుల్లో చేర్చాలని భానుక కోరారు.
- 2022లో ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించాల్సిన పనుల్లో జాప్యం కారణంగా, హైకోర్టును ఆశ్రయించడంపై బోర్డులో చర్చించారు. మూడేళ్లగా పనులు ఇవ్వకపోవడం పట్ల ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ తక్షణమే సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు.
- వీధి దీపాల నిర్వహణకు రికార్డు స్థాయిలో 272 బిడ్‌ల రావడంతో కాంట్రాక్టు ఖరారు చేసేందుకు రెండు నెలల వ్యవధిని కోరుతూ పాత కాంట్రాక్టర్‌కే బాధ్యతలు అప్పగిస్తూ తీర్మానించారు.
- రామన్నకుంట చెరువు సుందరీకరణ పనులకు బోర్డు ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈ పనులు చేపట్టనున్నారు.
- కంటోన్మెంట్ బోర్డు ఆదాయం కంటే ప్రజల భద్రతకే ప్రాధాన్యమిస్తూ, కంటోన్మెంట్ వ్యాప్తంగా ప్రైవేటు భవనాలపై ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను తొలగిస్తున్నామని సీఈఓ తెలిపారు.
- వక్ఫ్ భూములు అన్న సాకుతో భవన నిర్మాణ అనుమతులను నిలిపివేయడం సరికాదని ఎంపీ, బోర్డు అధికారులకు సూచించారు. తిరుమలగిరిలోని వనిత కో-ఆపరేటివ్ సొసైటీలో కలెక్టర్ ఆధ్వర్యంలో వేలం ద్వారా కొన్న భూములు వక్ఫ్ భూములు అనడంలో అర్థం లేదన్నారు.
- ఎలివేటెడ్ కారిడార్ కోసం సేకరించిన బీ–3 కేటగిరీ స్థలంలోని 77 నివాసాల పరిహారాన్ని బాధితులకు ఇచ్చాకే ఆయా స్థలాలను సేకరించాలని ఎంపీ సూచించారు.


బోర్డు సమావేశంలో పాల్గొన్న ఎంపీ, బోర్డు అధికారులు